ప్రత్యేకాధికారులకు మొదటి టాస్క్

- నేటి నుంచి గ్రామాల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్
- కొత్తగానే పాలన.. 15 వరకు నిర్వహణ
- పంచాయతీల్లో వేధిస్తున్న నిధుల కొరత
- మెదక్ జిల్లాకు రావాల్సిన రూ.20.25 కోట్లు
- మూడు విడతల ఎస్ఎఫ్‌సీ నిధులు పెండింగ్

7లో

విద్యాసంస్థల్లో

యాంటీ డ్రగ్ కమిటీలు

- సంగారెడ్డిలో రీజినల్ నార్కోటిక్ కోఆర్డినేషన్ సెంటర్
- గంజాయి, డ్రగ్స్ నియంత్రణే లక్ష్యంగా ముందడుగు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 6: సంగారెడ్డి జిల్లాలో గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టడానికి ఎస్పీ చెన్నూరి రూపేష్ కఠిన చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాను గంజాయి, డ్రగ్స్ రహితంగా మార్చడం కోసం కార్యాచరణ ప్రారంభించారు. ఇందులో భాగంగా సంగారెడ్డిలో త్వరలోనే రీజినల్ నార్కోటిక్ కో-ఆర్డినేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ జిల్లాలకు కలిపి ఈ సెంటర్ పనిచేయనున్నది. సెంటర్‌లో పనిచేసే సిబ్బంది క్షేత్రస్థాయిలో పోలీసులు నమోదు చేసిన డ్రగ్స్ కేసుల విచారణ, పరిశోధనకు సహకరిస్తారని ఎస్పీ చెన్నూరు రూపేశ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.



సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్

డ్రగ్స్ బాధితులను గుర్తించేందుకు టీ-న్యాబ్ నుంచి కిట్లు

మద్యం తాగిన విషయం తెలుసుకునే కిట్ల మాదిరిగానే గంజాయి, డ్రగ్స్ వాడకం గురించి తెలుసుకునేందుకు ప్రత్యేక కిట్లను జిల్లాకు తెప్పిస్తున్నారు. అవి ఇప్పటికే టీ-న్యాబ్ నుంచి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి చేరుకున్నాయి. త్వరలోనే వీటితో పరీక్షలు నిర్వహించనున్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ చైర్మన్‌గా..

గంజాయి, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. కంది శివారులోని ఐఐటీ, రుద్రారంలోని గీతం విశ్వవిద్యాలయం, సంగారెడ్డి సమీపంలోని ఎంఎన్ఆర్ విద్యాసంస్థలు, వోక్సెన్ విశ్వవిద్యాలయం, సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూలతో పాటు అన్ని కళాశాలలో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేయిస్తున్నారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ చైర్మన్‌గా ఉండే ఈ కమిటీలలో విద్యార్థులు సభ్యులుగా ఉంటారు. వీరందరితో వచ్చే వారంలో గీతం విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఎస్పీ సమావేశమై, డ్రగ్స్, గంజాయి వాడడంతో జరిగే నష్టాల గురించి వివరించనున్నారు.

విద్యాసంస్థల పరిసరాల్లో నిఘా

జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు కిలోమీటరు దూరంలో పాన్‌షాపులు లేకుండా చూస్తున్నామని ఎస్పీ రూపేష్ తెలిపారు. పాన్‌షాపుల్లో విదేశాల నుంచి తెప్పించిన సిగరెట్లు, గంజాయి చాక్‌లెట్లు విక్రయిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. వీటిపై సమగ్ర విచారణ జరిపిస్తున్నామన్నారు.

సంగారెడ్డిలో త్వరలో సీసీ కెమెరాలు

జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో పెద్దసంఖ్యలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్పీ నిర్ణయించారు. సంగారెడ్డిలోని సీసీ కెమెరాలు చాలా వరకు పనిచేయడం లేదని ఆయన దృష్టికిరావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు అవసరమైన నిధులను సమకూర్చేందుకు జిల్లా కలెక్టర్ సంసిద్ధత వ్యక్తం చేశారని ఎస్పీ రూపేశ్ తెలిపారు. ఇటీవలే పటాన్‌చెరులో పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు.



ఇతను గుమ్మడిదల మండలం అన్నారం గ్రామానికి చెందిన తలారి సాయికుమార్(25). జనవరి 10న ఫిట్స్ రావడంతో బంధువులు సాయికుమార్‌ను సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇన్‌పేషంట్‌గా చేర్చుకున్న వైద్యులు చికిత్స ప్రారంభించారు. జనవరి 13న సాయికుమార్ మూత్రానికి వెళ్ల వస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు ఆసుపత్రి చుట్టుపక్కల, సంగారెడ్డి పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని సోదరి భాగ్యలక్ష్మి సంగారెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది.



ఇతను సంగారెడ్డి పట్టణంలోని ఇంద్రకాలనీకి చెందిన పట్నం జగన్నాథం(75). గత ఏడాది డిసెంబరు 1న ఉదయం 9.30 గంటలకు వైద్యం కోసం భార్య లక్ష్మితో కలిసి సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. ఆసుపత్రిలో చూపించుకున్న తర్వాత ఇంటికి తిరిగి వెళ్లే క్రమంలో కనిపించకుండా పోయాడు.



ఇతను జహీరాబాద్ మండలం రాయిపల్లికి గ్రామానికి చెందిన ఎరుకల రమేష్(52). రమేష్ ఎడమ కాలికి గాయమైందని కుమారుడు ఎరుకల నర్సిములు గత ఏడాదిఅక్టోబరు 19న సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించాడు. చికిత్స పొందుతూ అక్టోబరు 20 ఉదయం 9.30 గంటల ప్రాంతంలో ఎరుకల రమేష్ బీడీ తాగి వస్తానని చెప్పి, బయటకు వెళ్లి తిరిగి రాలేదు.

రోగులు ఏమవుతున్నారు?

సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో మిస్సింగ్స్!

- అనారోగ్యంతో చేరి.. ఆ తర్వాత మాయం
- కేసుల నమోదుతో సరిపెడుతున్న పోలీసులు
- కుటుంబ సభ్యులకు గుండె కోత

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 6: ఆరోగ్యం బాగు చేయించుకుందామని ఆసుపత్రికి వస్తున్న కొందరు బాధితులు కనిపించకుండా పోతున్నారు. నెలలు గడిచినా వారు ఎక్కడున్నారు.. ఎక్కడికి వెళ్లారు అన్నది మిస్టరీగా మారింది. వారి కోసం బంధువులు అన్ని ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ చిక్కడం లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసి.. తమ వారి కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ఏడాదిలో పదుల సంఖ్యలో ఆసుపత్రి నుంచి మిస్సింగ్ కేసులు నమోదవుతున్నా ఇటు ఆసుపత్రి వర్గాలు.. అటు పోలీసులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు.



సంవత్సరాలుగా ఎదురుచూపులు

వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లిన వారు కనిపించకుండా పోతుండటంతో వారి బంధువులు తట్టుకోలేకపోతున్నారు. నిన్నామొన్నటి వరకు తమలో ఒకరిగా.. కష్టసుఖాల్లో పాలుపంచుకున్నవారు ఉన్నఫలంగా అదృశ్యం కావడం వెనుక కారణాలు తెలియక ఆవేదన చెందుతున్నారు. తమ వారి ఆచూకీ కోసం పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నా.. వారి జాడ మాత్రం తెలియడం లేదు.

నామ్‌కే వాస్తేగా పోలీస్ అవుట్ పోస్టు



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రధాన ద్వారం ఎదుట ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్టు పేరుకు మాత్రమే ఉంది. అక్కడ పోలీసు సిబ్బంది ఎవరూ అందుబాటులో ఉండరు. అక్కడ పోలీసు సిబ్బంది విధుల్లో ఉంటే రోగులు బయటకు వెళ్లే ఆపే అవకాశం ఉంటుంది.

ముందుకుసాగని పోలీసు దర్యాప్తు

పోలీసుశాఖలో ఖాళీలు ఎక్కువగా ఉండడం, ఉన్న సిబ్బంది రోజువారీ విధులకు సరిపోవడంతో తప్పిపోయిన వారి జాడ తెలుసుకొనేందుకు సమయం సరిపోవడం లేదు. జిల్లాకేంద్రంలో వీఐపీల పర్యటనలు, ఇతర ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యక్రమాలు ఎక్కువగా ఉండడంతో పోలీసులు బందోబస్తుకే సరిపోతున్నారు. కనిపించకుండా పోతున్నవారి జాడ తెలుసుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఆచూకీ 24 గంటల్లో తెలియకపోతే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాలి. సదరు వ్యక్తి ఫొటో, వివరాలు అన్ని పోలీస్‌స్టేషన్లకు పంపి, ప్రసారమాధ్యమాల్లో వచ్చేలా చూడాలి. సదరు వ్యక్తి తరచూ సందర్శించే స్థలాల్లో విచారణ జరపాల్సి ఉంటుంది. కానీ, ఇవన్నీ చేసేందుకు తీరిక లేక పోలీసులు మిస్సింగ్ కేసులను పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తప్పిపోయిన వారి బంధువులు పోలీస్‌స్టేషన్‌ల చుట్టూ తిరుగుతున్నా పోలీసులు మాత్రం చూస్తాం... వారి జాడ తెలిస్తే మేమే కబురు పెడతామంటూ సమాధానమిస్తున్నారు.

మానసిక పరిస్థితి బాగాలేకనే..

జిల్లా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరుతున్న కొందరు రోగులు కనిపించకుండా పోవడానికి ప్రధాన కారణం మానసిక స్థితి సరిగ్గా లేకపోవడమే. కొంత మంది రోగులు వారి కుటుంబాల నిరాదరణకు గురికావడం వల్ల కూడా కనిపించకుండా పోతున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో మొత్తం 22 సీసీ కెమెరాలు పని చేస్తున్నాయి. సెక్యూరిటీ గార్డు కూడా విధులు నిర్వహిస్తున్నాడు.

– డాక్టర్ అనిల్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్

అక్కడ అవిశ్వాసం..

ఇక్కడ చీలిక!

జిన్నారంలో ఎంపీపీపై బీఆర్ఎస్ గురి.. బొల్లారంలో కారు దిగిన కౌన్సిలర్లు

- మండలంలో వేడెక్కిన రాజకీయాలు

జిన్నారం, ఫిబ్రవరి 6: జిన్నారం మండలంలో రాజకీయ ముఖచిత్రం వేగంగా మారుతున్నది. కాంగ్రెస్‌కు చెందిన ఎంపీపీపై బీఆర్ఎస్ ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టగా.. బొల్లారం మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు చెందిన ఆరుగురు కౌన్సిలర్లు అధికార పార్టీలో చేరారు.

బీఆర్ఎస్‌కే బలం


జిన్నారం మండల పరిషత్ అధ్యక్షుడు రవీందర్ గౌడ్ (కాంగ్రెస్)పై బీఆర్ఎస్ పార్టీకి చెందిన 5 మంది ఎంపీటీసీలు అవిశ్వాసం ప్రకటిస్తూ ఆర్డీవోకు నోటీసులు ఇచ్చారు. మండలంలో మొత్తం 8 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి నలుగురు, కాంగ్రెస్ నుంచి నలుగురు సభ్యులు ఎన్నికయ్యారు. దీంతో మండల పరిషత్ అధ్యక్షుడిని ఎన్నుకోవడానికి లాటరీ తీయగా కాంగ్రెస్‌కు ఎంపీపీ పీఠం దక్కింది. అనంతరం కాంగ్రెస్ నుంచి ఇద్దరు ఎంపీటీసీలు బీఆర్ఎస్‌లో చేరారు. అదే సమయంలో బీఆర్ఎస్‌కు చెందిన ఒకరు కాంగ్రెస్ గూటికి చేరారు. ప్రస్తుతం బీఆర్ఎస్ వైపు ఐదుగురు, కాంగ్రెస్‌కు ముగ్గురు ఎంపీటీసీలు ఉన్నారు. దీంతో అవిశ్వాస సమావేశం నిర్వహిస్తే బీఆర్ఎస్‌కే సంఖ్యా బలం ఉన్నది.

కాంగ్రెస్ గూటికి బీఆర్ఎస్ కౌన్సిలర్లు

మండలంలోనే అతిపెద్ద పారిశ్రామికవాడ అయిన బొల్లారం మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు చెందిన ఆరుగురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. ఇక్కడ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బీఆర్ఎస్‌కు చెందిన రోజారాణి బాల్‌రెడ్డి ఉన్నారు. ఆ పార్టీకి ఇంకా 14 మంది కౌన్సిలర్లు ఉన్నారు.

ఆది నుంచి అసంతృప్తి

బీఆర్ఎస్‌కు చెందిన సీనియర్ నాయకుడు, కౌన్సిలర్ చంద్రారెడ్డి వర్గానికి, చైర్‌పర్సన్ వర్గానికి మొదటి నుంచి ఉప్పు నిప్పులా ఉండేది. నిధుల కేటాయింపులో, పార్టీలో కార్యక్రమాల్లో ప్రాధాన్యం దక్కడం లేదని చంద్రారెడ్డి వర్గం అసంతృప్తితో ఉన్నారు. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులపై నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నారని 5వ తేదీన జరిగిన మున్సిపల్ సమావేశాన్ని వారు బహిష్కరించారు. బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈమేరకు ఆరుగురు కౌన్సిలర్లు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు చంద్రారెడ్డి, నిహారికరెడ్డి, చంద్రయ్య, గోపాలమ్మ, రాధ, జయమ్మ కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి, కౌన్సిలర్లు మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో సామాజిక న్యాయం లేదని, కష్టపడి పనిచేసినవారికి తగిన గుర్తింపు దక్కడం లేదని విమర్శించారు. బొల్లారం మున్సిపాలిటీలో నియంతృత్వ పోరాటం చేస్తామని అన్నారు. అంతకుముందు బొల్లారం నుంచి చంద్రారెడ్డి, ఆయన అనుచరులు భారీ ర్యాలీగా హైదరాబాద్ తరలివెళ్లారు. వారి వెంట నాయకులు జైపాల్‌రెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, రాజ్‌గోపాల్, శ్రీకాంత్‌రెడ్డి, బషీర్ తదితరులు ఉన్నారు.



కౌన్సిలర్ చంద్రారెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్న దీపాదాస్ మున్షి, మైనంపల్లి హన్మంతరావు

పీఎం విశ్వకర్మ యోజనను

సద్వినియోగం చేసుకోవాలి

- మెదక్ కలెక్టర్ రాజర్షిషా

7లో

కాళ్లకల్ బంగారమ్మ ఆలయంలో

దిపాదాస్ మున్షి పూజలు



బంగారమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న దీపాదాస్‌మున్షి

మనోహరాబాద్, ఫిబ్రవరి 6: కాళ్లకల్‌లోని బంగారమ్మ ఆలయంలో కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి మంగళవారం పూజలు నిర్వహించారు. చలో సిద్దిపేట కార్యక్రమానికి వెళ్తున్న క్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డితో కలసి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు.

ఘనపురం ఆయకట్టుకు

సింగూరు జలాలు

- మూడో విడతలో 0.35 టీఎంసీల నీటి విడుదల
- ప్రస్తుతం ప్రాజెక్టులో 22.957 టీఎంసీల నిల్వ

పుల్‌కల్, ఫిబ్రవరి 6: మెదక్ జిల్లాలోని ఘనపురం ఆయకట్టు పరిరక్షణకు మంగళవారం సింగూరు జలాలను విడుదల చేశారు. ఘనపురం ఆనకట్ట కుడి, ఎడమ కాలువల కింద యాసంగి నాట్లు జోరుగా వేశారు. ఆయకట్టు పరిరక్షణకు సింగూరు జలాలను విడుదల చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జలవిద్యుత్ కేంద్రం గేటు ద్వారా 1,460 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న మంజీర జలాశయంలోకి వదులుతున్నారు. అక్కడి నుంచి నేడు లేదా రేపు ఘనపురం ఆనకట్టకు నీటిని విడుదల చేసే అవకాశాలున్నాయి.

ఇప్పటికే రెండుసార్లు..

ఘనపురం ఆయకట్టుకు యాసంగి సీజన్ పూర్తయ్యేంత వరకు నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు జేఈఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే రెండు సార్లు నీటిని విడుదల చేశామని, మూడో విడతగా ప్రస్తుతం 0.35 టీఎంసీలు విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. వరి కోతకు వచ్చేంత వరకు అవసరమైనంత నీటిని విడుదల చేస్తామని తెలిపారు. మంజీరా పరివాహక ప్రాంత రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పుష్కలంగా నీటి నిల్వ

సింగూరు ప్రాజెక్టులో మంగళవారం ఉదయం నాటికి 22.957 టీఎంసీ నీరు నిల్వ ఉంది. హైదరాబాద్ మంచినీటి సరఫరాకు 80 క్యూసెక్కులు, మిషన్‌భగీరథకు 70 క్యూసెక్కులు, 275 క్యూసెక్కులు ఆవిరి చొప్పున ప్రతీరోజు 575 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో నమోదవుతున్నది. ప్రాజెక్టులో వర్షాకాలం వచ్చేవ రకు తాగు, సాగునీటి అవసరాలకు సరిపోయేంత నీరుందని అధికారులు తెలిపారు.

గులాబీ తోటలో

పాగా వేసేదెవరు..!

మెదక్ ఎంపీ టికెట్ కోసం పోటాపోటీ

- బీఆర్ఎస్‌లో 'వంటేరు'కు అధినేత గ్రీన్‌సిగ్నల్?
- కాంగ్రెస్ టికెట్ రేసులో జగ్గారెడ్డి, మైనంపల్లి పేర్లు
- బీజేపీలో ముగ్గురు



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 6: మెదక్ ఎంపీ టికెట్ కోసం ప్రధాన పార్టీల్లో పోటాపోటీ నెలకొన్నది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆరు చోట్ల గెలిచి బీఆర్ఎస్ సత్తా చాటింది. మెదక్ సెగ్మెంట్‌లో మాత్రమే కాంగ్రెస్ గెలిచింది. అసెంబ్లీ ఫలితాలతో సబంధం లేకుండా రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఈ సీటును కైవసం చేసుకునేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు ప్రయత్నిస్తున్నాయి.

ఎవరి ధీమా వారిది

తన సిట్టింగ్ స్థానంలో మరోసారి గెలిచి మెదక్ అంటే బీఆర్ఎస్ కంచుకోట అని చాటాలని గులాబీ పార్టీ బలంగా ప్రయత్నిస్తున్నది. రాష్ట్రంలో అధికారం చేపట్టి ఊపుమీదున్న కాంగ్రెస్ మెదక్ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ కోటను బద్దలు కొట్టి సత్తా చాటాలని పట్టుదలతో ఉన్నది. మరోవైపు, అయోధ్య రామ మందిర నిర్మాణం, ప్రధాని మోదీ చరిష్మాపై బీజేపీ ఆశలు పెట్టుకున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో తమకు మంచి ఫలితాలే వచ్చాయని, పార్లమెంట్ ఎలక్షన్లలోనూ అదే హవా కొనసాగిస్తామని కమలం పార్టీ శ్రేణులు ధీమాతో ఉన్నాయి. ఇలా అన్ని పార్టీల్లోనూ ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. దీంతో ఎవరికి టికెట్ వస్తున్నదో చెప్పలేని పరిస్థితి నెలకొన్నది.

బీఆర్ఎస్ నుంచి ప్రతాప్‌రెడ్డికి అవకాశం!

బీఆర్ఎస్ టికెట్ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, గజ్వేల్‌కు చెందిన వంటేరు ప్రతాప్‌రెడ్డికి ఇచ్చే అవకాశం ఉన్నట్టు తెలిసింది. ఈమేరకు గులాబీ అధినేత కేసీఆర్ ఇప్పటికే సిగ్నల్ ఇచ్చారని ప్రచారంలో ఉన్నది. బీఆర్ఎస్ టికెట్ కోసం ఆశావహులు ఎక్కువగానే ఉన్నా.. ఎమ్మెల్సీ వెంకట్ రాంరెడ్డిని ఎంపీగా పోటీ బరిలో దింపుతారని ప్రచారం జరిగింది. ఇందుకు తగినట్టే ఆయన నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సరం, సంక్రాంతి పండగలకు శుభాకాంక్షలు తెలుపుతూ సందేశాలు పంపించారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని పట్టణాల్లో విలేకరులతో సమావేశం కావాలని ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ, కుటుంబసభ్యుల నుంచి వ్యతిరేకత రావడంతో ఆయన పోటీ నుంచి తప్పుకున్నట్టు తెలిసింది. ఎమ్మెల్సీగా ఇంకా మూడున్నర సంవత్సరాల పదవీ కాలం ఉండడం, కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టాల్సి రావడం, ఆయన సోదరుడు.. మంత్రి పొంగులేటి సోదరుడితో వియ్యం అందుకుంటుండడంతో ఎంపీగా బరిలో దిగడంపై పునరాలోచనలో పడినట్టు భావిస్తున్నారు. మరోవైపు, మెదక్ ఎంపీగా తనకు అవకాశం ఇస్తామని గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలుపుకోవాలని నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పార్టీ అధినేత, తన మిత్రుడు కేసీఆర్‌ను కోరుతున్నారు. అలాగే, తెలంగాణ ఉద్యమంలో జిల్లాలో క్రియాశీలకంగా పనిచేసిన మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ, బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి జి.బీరయ్యయాదవ్ కూడా తమకు టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు.

కాంగ్రెస్‌లో హేమాహేమీలు

కాంగ్రెస్ టికెట్‌కు మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మైనంపల్లి హన్మంతరావు పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. కానీ వీరిద్దరూ టికెట్ కోసం పార్టీకి దరఖాస్తు చేసుకోలేదని తెలిసింది. వీరిద్దరితో పాటుఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎంపీ విజయశాంతి పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నది. వీరితోపాటు మాజీ ఎమ్మెల్యే టి.నర్సారెడ్డి, దుబ్బాకకు చెందిన చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు భవానీరెడ్డి, బండారు శ్రీకాంత్ కూడా తమ ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

బీజేపీ టికెట్ ఎవరికో?

బీజేపీ నుంచి మెదక్ టికెట్ కోసం మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్ రావు, పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. మల్కాజ్‌గిరి లేదా కరీంనగర్ ఎంపీ టికెట్ కావాలని ఈటల రాజేందర్ కోరుతున్నా.. ఇచ్చే అవకాశాలు లేవని, ఆయన ఒప్పుకుంటే మెదక్ టికెట్ ఇస్తారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. దుబ్బాక మాజీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు కూడా మెదక్ ఎంపీగా పోటీ చేయాలని ఉత్సాహంతో ఉన్నారు. తనకు సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లో పట్టున్నదని, టికెట్ ఇస్తే విజయం సాధిస్తానని ఆయన అగ్రనేతలకు వివరించినట్లు తెలిసింది. అలాగే, ఆర్ఎస్ఎస్ నేపథ్యం, మొదటి నుంచి పార్టీ కోసం కష్టపడుతుండడంతో తనకు టికెట్ ఇవ్వాలని జిల్లా మాజీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి కోరుతున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై ఆయన నమ్మకం పెట్టుకున్నారు.

కుష్ఠు నిర్మూలనకు కలిసికట్టుగా కృషి చేయాలి

● వైద్య ఆరోగ్యశాఖ డీపీఎంలు

కంది, ఫిబ్రవరి 6: కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కలిసికట్టుగా కృషి చేయాలని వైద్యఆరోగ్య శాఖ లెప్రసీ విభాగం డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్లు మారుతి, ప్రతాప్‌గౌడ్ అన్నారు. కుష్ఠు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా కంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం కుష్ఠు వ్యాధి వ్యాప్తి, నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్పర్శ లేని మచ్చలుంటే అప్రమత్తమై దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. కుష్ఠు వ్యాధికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా మందులు అందజేస్తారని పేర్కొన్నారు. అనంతరం పొగాకు నియంత్రణ సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి పొగాకు వాడకం, అనర్థాలపై అవగాహన కల్పించారు. అంతకుముందు కుష్ఠు వ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ డీపీఎంలు, సిబ్బంది

తాళం వేసి ఉన్న రెండిళ్లలో చోరీ

హత్నూర, ఫిబ్రవరి 6: తాళం వేసిన రెండిళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. హత్నూర పరిధిలోని రెడ్డిఖానాపూర్ గ్రామానికి చెందిన వడ్ల కల్యాన్‌చారి, దేవనోల్ల శివరాజ్ వేరే గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు రెండు ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇరుగుపొరుగు వారి ద్వారా విషయం తెలుసుకున్న ఇళ్ల యజమానులు మంగళవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు ఇళ్లలో నగదు, నగలు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు.


ఇంట్లోని వస్తువులను చిందరవందరగా పడేసిన దృశ్యం

ప్రత్యేకాధికారులకు మొదటి టాస్క్


కోహీర్ మండలంలోని సజ్జాపూర్ గ్రామం

- నేటి నుంచి గ్రామాల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్
- పంచాయతీల్లో వేధిస్తున్న నిధుల కొరత
- మెదక్ జిల్లాకు రావాల్సిన రూ.20.25 కోట్లు
- మూడు విడతల్లో ఎస్ఎఫ్‌సీ నిధులు పెండింగ్
- జిల్లాలో 469 జీపీలకు.. 469 మంది స్పెషలాఫీసర్లు


మెదక్ అర్బన్: మల్కాపూర్ గ్రామంలో రోడ్లను శుభ్రం చేస్తున్న గ్రామస్థులు(ఫైల్)

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 6: గ్రామపంచాయతీల్లో సర్పంచుల పదవీకాలం ఇటీవల ముగిసింది. ఈనెల 2 నుంచి స్పెషలాఫీసర్ల పాలన ప్రారంభమైంది. దాంతో రాష్ట్ర సర్కార్ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించింది. నేటి బుధవారం నుంచి 15వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించింది. ప్రత్యేకాధికారుల పాలన మొదలైన తర్వాత మొదటి కార్యక్రమం ఇది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. కానీ, నిధులు కేటాయింపుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడం గమనార్హం. మెదక్ జిల్లావ్యాప్తంగా 21 మండలాల్లోని 469 గ్రామపంచాయతీలకు 469 మందిని ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది.

సర్కార్ మార్క్ కనిపించేలా

గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లెప్రగతి పేరిట ఏటా జూన్, జూలై నెలల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టేది. ఇందుకోసం ముందుగానే గ్రామాలకు ప్రత్యేక నిధులు మంజూరు చేసేది. గత సర్కార్ మాదిరిగానే పల్లె పాలనపై తమదైన ముద్ర వేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో కలెక్టర్లు, పంచాయతీ అధికారులు, ప్రత్యేకాధికారులతో 3న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క వారంరోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్దేశించారు. 7 నుంచి 15 వరకు అన్ని గ్రామాల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు, మహిళా సంఘాల సభ్యులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఆ మేరకు పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణతోపాటు గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లు, ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను శుభ్రం చేయాలని, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ఆమె ఆదేశించారు.

ప్రత్యేకాధికారులకు సవాల్

సర్పంచుల స్థానంలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎంపీవోలు, ఆర్ఐ, విద్య, మిషన్‌భగీరథ అధికారులను పంచాయతీ పాలనతో సంబంధం లేకుండా స్పెషలాఫీసర్లుగా నియమించారు. నేటి నుంచి స్పెషల్ డ్రైవ్ ప్రారంభమవుతున్నది. అయితే ప్రభుత్వం నిధులు ఇస్తేనే పారిశుధ్య, తాగునీటి సమస్య పరిష్కరించే అవకాశం ఉన్నది. ప్రస్తుతం చిన్నపాటి పనులు చేసేందుకు పలు జీపీల్లో పైసా లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ఏ విధంగా పూర్తి చేస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. పంచాయతీల స్పెషలాఫీసర్లుగా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన అధికారులకు ఇది మొదటి సవాల్‌గా నిలువనున్నది.

వేధిస్తున్న నిధుల కొరత

జిల్లాలో ఉన్న పంచాయతీలన్నీ నిధులలేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. చేసిన పనులకు బిల్లులు రాలేదని మాజీ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని చాలా పంచాయతీల్లో నిధుల సమస్య నెలకొన్నది. జిల్లాకు మరోవైపు పంచాయతీలకు రావాల్సిన రాష్ట్ర ఆర్థిక సంఘం(ఎస్ఎఫ్‌సీ) నిధులు మూడు విడతలకు సంబంధించి రూ.20.25 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

పనితీరు ఆధారంగా ఉత్తమ జీపీల ఎంపిక

కోహీర్ ఫిబ్రవరి 6: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ చివరిరోజు ఫిబ్రవరి 8న పంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభలు నిర్వహించి చేసిన పనులపై అధికారులు సమీక్షించనున్నారు. మద్యపానం, మత్తు పదార్థాలు, గుట్కా వంటి వాటికి యువత దూరంగా ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. అనంతరం పనితీరు ఆధారంగా జిల్లాస్థాయిలో ఉత్తమ జీపీలను ఎంపిక చేయనున్నారు. ఉత్తమ పనితీరు కనబరిచిన కార్మికులు, గ్రామపంచాయతీలకు కలెక్టర్ ఆధ్వర్యంలో అవార్డులు అందజేస్తారు. అంతేకాకుండా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో చేపట్టిన పనులకు సంబంధించి ఫొటో సెషన్ ఏర్పాటు చేయనున్నారు.

చేపట్టే పనులివి..


పాఠశాలలు, అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా అవగాహన కల్పిస్తారు. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాల తొలగింపు, ఉపయోగపడని బావులను పూడ్చివేయడం, రోడ్లు, ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రపరచడం, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించడం వంటి పనులు చేపడుతారు. మురుగు కాలువల్లో వ్యర్థపు నీరు నిల్వ ఉండకుండా పూడిక తీయడం, వీధుల్లో గుంతలను పూడ్చడం, దోమలు వృద్ధి చెందకుండా రసాయనం పిచికారీ చేయడం వంటివి స్పెషల్ డ్రైవ్‌లో చేయనున్నారు.

సొంత వనరులతో నిర్వహణ



గ్రామపంచాయతీల్లో ఉన్న సొంత వనరులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. ప్రత్యేకంగా ఎలాంటి నిధులు విడుదల కాలేదు. రాష్ట్ర ఆర్థిక సంఘం (ఎస్ఎఫ్‌సీ) గత మూడు విడతల పెండింగ్‌లో ఉన్నది. కేంద్రం ఇచ్చే 15 ఆర్థిక సంఘం నుంచి ప్రతి నెల నేరుగా గ్రామపంచాయతీ జీరో ఖాతాల్లో జమవుతున్నాయి. విడుదలైన నిధులను అన్ని గ్రామపంచాయతీల్లో నిబంధనల ప్రకారం ఖర్చు చేసేలా చూస్తున్నాం.

- సాయిబాబా,
జిల్లా పంచాయతీ అధికారి, మెదక్





భూములు అన్యాక్రాంతం కావొద్దు: కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 6: సంగారెడ్డి జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డిలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని, వాటి చుట్టూ రెండు వరుసల్లో మొక్కలు నాటాలని సూచించారు. పాఠశాలలు కళాశాలలు, ప్రభుత్వ స్థలాలను గుర్తించి ప్లాంటేషన్ చేయాలని, పురపాలికల్లోని అన్ని ప్రధాన రహదారులకు ఇరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్ చేయాలని, ఆరు ఫీట్ల మొక్కలు నాటాలన్నారు. రాజీవ్ పార్కు అభివృద్ధికి అంచనా వేసి ప్రతిపాదనలు రూపొందించాలని కమిషనర్‌కు ఆదేశించారు. వంద శాతం పన్నులు వసూలు చేయాలన్నారు.

అంగన్‌వాడీ భవనాలను పూర్తి చేయండి

జిల్లాలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. అంగన్‌వాడీ పరిధిలోని (సామ్, మామ్) లోప పోషణతో ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి సాధారణ స్థితికి వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సీడీపీవోలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. సంగారెడ్డిలోని మహిళా ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న వృద్ధాశ్రమం పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీ పడవద్దని స్పష్టం చేశారు. వృద్ధాశ్రమానికి అవసరమైన ఫర్నిచర్, బెడ్స్ వంటి ఏర్పాట్లకు ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నారాయణఖేడ్ బాలసదనానికి కూడా ప్రతిపాదనలు అందజేయాలన్నారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీడబ్ల్యూవో సంధ్యారాణి, మున్సిపల్ కమిషనర్ సుజాత, వివిధ శాఖల ధికారులు పాల్గొన్నారు.


వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

టేక్మాల్, ఫిబ్రవరి 6: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టేక్మాల్ మండలం వెంకటాపూర్‌కు చెందిన ఉప్పరి అమృత(45) చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మానసికంగా బాధపడుతూ ఉండేవాడు. సోమవారం పాపన్నపేట మండంలోని నార్సింగికి వెళ్లొస్తానని తెలిపాడు. రాత్రయినా రాకపోవడంతో కుటుంబసభ్యులు బావి వద్దకెళ్లి చూసేసరికి ఉరేసుకుని కనిపించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

పీఎం విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

● మెదక్ కలెక్టర్ రాజర్షిషా



పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాజర్షిషా


మెదక్ అర్బన్, ఫిబ్రవరి 6: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా అర్హులను కోరారు. మంగళవారం తన ఛాంబర్‌లో జిల్లా అధికారులతో పథకంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కుల వృత్తుల వారిని గుర్తించి నైపుణ్యాలను అభివృద్ధి చేసి, వారికి ఆర్థికంగా చేయూతనిచ్చి జీవనోపాధిని పెంపొందించేందుకే ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. పథకంపై పట్టణ, మండలాల్లో స్వయం సహాయక బృందాలు, పట్టణాభివృద్ధి సంస్థ రిసోర్స్ పర్సన్స్ ద్వారా విస్తృతస్థాయిలో ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు కృష్ణమూర్తి, సాయిబాబా, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, మెప్మాపీడీ ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

పది, ఇంటర్‌లో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

తూప్రాన్, ఫిబ్రవరి 6: పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అధ్యాపకులు, ఉపాధ్యాయులు కృషిచేయాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. మంగళవారం తూప్రాన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్పీహెచ్ఎస్ పాఠశాల, తెలంగాణ గురుకుల కళాశాలను ఇంటర్ జిల్లా విద్యాధికారి సత్యనారాయణ, జిల్లా విద్యాధికారి రాధాకిషన్‌తో కలిసి కలెక్టర్ సందర్శించి మాట్లాడారు. పది, ఇంటర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంతోపాటు వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఇంటి వద్ద తీసుకోవాల్సిన చర్యలు, ప్రిపరేషన్ గురించి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులకు అందుతున్న అల్పాహారాన్ని పరిశీలించి రుచి చూశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయచందర్, ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు. అలాగే తూప్రాన్ మండల పరిధిలోని ఘణపూర్‌లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలను జడ్పీసీఈవో శైలేష్ మంగళవారం సందర్శించి, ఉత్తమ ఫలితాలకై ఉపాధ్యాయుల, విద్యార్థులు కృషి చేయాలని సూచించారు.







లష్కర్‌వారం బుకింగ్ ఆదాయం రూ.55.70లక్షలు


బుకింగ్ కార్యాలయ కౌంటర్‌లో బారులుతీరిన భక్తులు

చేర్యాల, ఫిబ్రవరి 6: కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోవారాన్ని పురస్కరించుకుని భక్తులు భారీగా తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నందున రూ.55.70 లక్షల మేర బుకింగ్ ఆదాయం సమకూరినట్లు ఆలయవర్గాలు తెలిపాయి. భక్తులు మొక్కుబడులుగా సమర్పించిన తలనీలాలు, నిర్వహించిన ఆర్జితసేవలు, రచించిన పట్నాలు, బోనాలు, ప్రసాద విక్రయాలు, ప్రత్యేక దర్శనాలు, వసతి గదుల అద్దె తదితరాల ద్వారా శనివారం రూ.3,69,032, ఆదివారం రూ.45,65,237, సోమవారం రూ.6,36,195 చొప్పున మొత్తం రూ.55,70,464 ఆదాయం సమకూరింది. గతేడాది సుమారు రూ.37.99లక్షలు రాగా.. ఈయేడాది సుమారు రూ.17.70 లక్షలు పెరిగింది. జాతరకు తోడు మేడారం భక్తులు తరలివస్తుండటంతో మూడువారాల్లో గతేడాదికన్నా అధికంగా బుకింగ్ ఆదాయం సమకూరుతున్నది.

సీఎం రేవంత్‌రెడ్డికి బాల్క సుమన్ క్షమాపణలు చెప్పాలి

సీఎం రేవంత్‌రెడ్డికి బాల్క సుమన్ క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన అనుచిత వాఖ్యలను నిరసిస్తూ మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన దిష్టిబొమ్మలను దహనం చేశారు. అలాగే పలు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. బాల్క సుమన్‌కు ముఖ్యమంత్రిపై వ్యాఖ్యలు చేసే స్థాయి లేదన్నారు. ఎంతో మంది ఉద్యమకారులను మభ్యపెట్టి బాల్క సుమన్ పబ్బం గడుపుకున్నారని విమర్శించారు. సీఎంకు క్షమాపణ చెప్పి, తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకుంటే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.



వెల్దుర్తిలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



పటాన్‌చెరులో బాల్క సుమన్ ఫ్లెక్సీని చెప్పులతో కొడుతున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 6: నారాయణఖేడ్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేకర్‌రెడ్డి, న్యాయవాది బోజిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ ముంతాజ్, లింగారెడ్డి,గంగారెడ్డి, పండరిరెడ్డి, యూసుఫ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

● **వెల్దుర్తి:** వెల్దుర్తిలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అలాగే స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాల్క సుమన్‌పై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, సొసైటి డైరెక్టర్ కిష్టాగౌడ్, నాయకులు నరేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, దుర్గాగౌడ్, కృష్ణ, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

● **చేగుంట:** కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్ చేగుంటలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బాల్క సుమన్‌పై కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జేఏసీ జిల్లా నాయకులు కొండాపురం బాలరాజు గౌడ్, బోయిని ప్రభాకర్, మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మీనర్సింహులు, తాళ్ల చిన్నకృష్ణ గౌడ్, ఎస్.ఎ.రుక్మద్దీన్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు గజగట్ల కేశవులు, శ్రీధర్‌రెడ్డి, గుర్రాల సుధాకర్ పాల్గొన్నారు.

● **రామాయంపేట:** పట్టణంలోని వివేకానంద చౌరాస్తాలో మంగళవారం బాల్క సుమన్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రమేష్‌రెడ్డి, ఎస్సీ సెల్ నాయకుడు భైరం కుమార్, మండల కాంగ్రెస్ నేతలు చింతలు స్వామి, డాకి స్వామి, ఎంపీటీసీ నాగులు, అల్లాడి వెంకటి పాల్గొన్నారు.

● **గుమ్మడిదల:** మాజీ ఎమ్మెల్యే బాల్కన్ సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ క్షమాపణ చెప్పాలని గుమ్మడిదల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగ్‌రావు డిమాండ్ చేశారు.

●**పటాన్‌చెరు:** పటాన్‌చెరులో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పటాన్‌చెరు పోలీసుస్టేషన్‌లో బాల్క సుమన్‌పై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కే.నర్సింహారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, సామయ్య, కుంచాల లక్ష్మీ, నరేందర్‌గౌడ్, ఆసిఫ్, హమీద్‌పాషా, రాజు, ప్రభాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి జైలు

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 6: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి ఆరునెలల జైలు శిక్షను విధిస్తూ నారాయణఖేడ్ ఫస్ట్‌క్లాస్ న్యాయాధికారి ఎం.శ్రీధర్ మంగళవారం తీర్పునిచ్చారు. ఎస్పీ రూపేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణఖేడ్‌కు చెందిన నర్సయ్య 2016 జూన్ 16న బైక్‌పై వెళ్తుండగా బీదర్ జిల్లా చిల్గిరికి చెందిన శివాజీరావు జూజాలాపూర్ వద్ద ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నర్సయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృచెందాడు. మృతుడి సోదరుడు రాములు ఫిర్యాదు మేరకు నారాయణఖేడ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం శివాజీరావుకు శిక్షను ఖరారు చేస్తూ న్యాయాధికారి తీర్పునిచ్చారు.

తూప్రాన్ పట్టణంలోని రెండు దుకాణాల్లో చోరీ

తూప్రాన్, ఫిబ్రవరి 6: తూప్రాన్ పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న రెండు దుకాణాల్లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. తూప్రాన్ పట్టణానికి చెందిన మన్నే కుమార్ మణికంఠ ట్రేడర్స్ ఏర్పాటు చేసి సిమెంటు, స్టీలును విక్రయిస్తున్నాడు. రాత్రి దొంగలు దుకాణ పైకప్పు రేకులను తొలగించి కౌంటర్‌లో ఉన్న రూ.14వేల నగదు, 20 తులాల వెండి విగ్రహాలను చోరీ చేశారు. పక్కనే ఉన్న సంతోష్‌కుమార్‌కు చెందిన నటరాజ్ ట్రేడర్స్ దుకాణ షట్టర్‌ను తొలగించి అందులో ఉన్న రూ.5వేల నగదును ఎత్తుకెళ్లారు. అంతేకాకుండా ఆ దుకాణాల్లో ఉన్న సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్‌లను కూడా ఎత్తుకెళ్లారు. మరో రెండు దుకాణాల్లో చోరీకి యత్నించారు. మంగళవారం ఉదయం తూప్రాన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

బాలికల ఆత్మహత్యను నిరసిస్తూ ఆందోళన



రామాయంపేటలో రాస్తారోకో చేస్తున్న ఏబీవీపీ నాయకులు

రామాయంపేట, ఫిబ్రవరి 6 : భువనగిరి ఎస్సీ హాస్టల్లో ఇద్దరు బాలికల ఆత్మహత్యలను నిరసిస్తూ మంగళవారం విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. ఏబీవీపీ ఆధ్వర్యంలో రామాయంపేటలో విద్యార్థినులు రోడ్డుపై బైఠాయించారు. విద్యార్థినుల ఆత్మహత్యకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కోమటిపల్లిలో మహిళ అదృశ్యం



దివ్య (ఫైల్)

రామాయంపేట, ఫిబ్రవరి 6: భర్తతో గొడవపడి, ఇంటి నుంచి వెళ్లిన మహిళ తిరిగి రాలేదు. రామాయంపేట మున్సిపల్ పరిధిలోని కోమటిపల్లికి చెందిన దివ్య(30) మూడు రోజుల క్రితం భర్తతో గొడవపడి కోపంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు ఆమె కోసం పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఆమె భర్త భూదయ్య ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ రంజిత్ కేసు దర్యాప్తు చేపట్టారు.

అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన అధికారులు



సిద్ధాపూర్‌లో నిర్మాణాలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

సదాశివపేట, ఫిబ్రవరి 6: పట్టణంలో అక్రమ నిర్మాణాలను మంగళవారం అధికారులు కూల్చివేశారు. 65వ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న సిద్ధాపూర్ చౌరస్తా నుంచి సిద్ధాపూర్ రోడ్డు మార్గంలో దాదాపు అర కిలోమీటరు దూరం వరకు అక్రమంగా ఏర్పాటు చేసిన షాపులను, రేకుల షెడ్లను, చిరువ్యాపారుల దుకాణాలను మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో టౌన్‌ప్లానింగ్ విభాగం సిబ్బంది కూల్చివేశారు. దశాబ్దాలుగా ఆయా స్థలాల్లో కబ్జా ఉంటూ మున్సిపల్‌కు ఆస్తిపన్ను చెల్లిస్తున్నా ఎందుకు కూల్చివేస్తున్నారంటూ కొందరు చిరు వ్యాపారులు అధికారులతో వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్తత నెలకొంది.

తిరుమలాపూర్ శివారులోని ప్రభుత్వ భూముల సర్వే

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 6: పెద్దశంకరంపేట పట్టణంలోని తిరుమలాపూర్ శివారులోని ప్రభుత్వ భూముల్లో తూప్రాన్ డివిజన్ డీఐఈ శేఖర్ వర్మ, ఇతర అధికారులు మంగళవారం సర్వే చేపట్టారు. హద్దులను గుర్తించి సర్వే పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పెద్దశంకరంపేట ఆర్‌ఐ శర్ణప్ప, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల నిర్వహణపై అవగాహన

పాపన్నపేట, ఫిబ్రవరి 6: విపత్తుల సమయంలో ఎన్డీఆర్ఎఫ్ పాత్ర చాలా కీలకమని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు అన్నారు. ఎన్డీఆర్ఎఫ్(జాతీయ విపత్తుల ప్రతిస్పందన ఫోర్స్) 10వ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ మన్మోహన్‌యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం పాపన్నపేటలో అవగాహన కల్పించారు. విపత్తుల సమయంలో ప్రాణాలు కాపాడుకునే విధానాలపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, ఎస్‌ఐ నరేందర్, ఎంపీవో లక్ష్మీకాంతరెడ్డి, ఎన్డీఆర్ఎఫ్ ఏఎస్‌ఐ మద్దిలేటి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలోనే దేశాభివృద్ధి



మాట్లాడుతున్న మెదక్ అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జి విజయ్‌కుమార్

పాపన్నపేట, ఫిబ్రవరి 6: ప్రధాని మోదీ నాయకత్వం, బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని మెదక్ అసెంబ్లీ ఇన్‌చార్జి పంజా విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం పాపన్నపేటలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మెదక్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతీ ఇంటికి వివరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. సమావేశంలో నాయకులు బీకొండ రాములు, కిష్టయ్య, విఠల్, సంగమేశ్వర్, వినోద్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరతో పంటలను కొనుగోలు చేయాలి

హవేళీఘణపూర్, ఫిబ్రవరి 6: ప్రభుత్వాలు రైతులు పండించిన పంటలను మద్దతు దరలతో కొనుగోలు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్యాల వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అనిల్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, జోనల్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా నాయకులు శ్రీపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ సిబ్బందితో డీఆర్‌డీఏ అదనపు పీడీ సమీక్ష

శివ్వంపేట, ఫిబ్రవరి 6: నర్సాపూర్, శివ్వంపేట మండలాల పరిధిలోని ఐకేపీ సిబ్బందితో మండల కేంద్రమైన శివ్వంపేటలో మంగళవారం డీఆర్‌డీఏ అదనపు పీడీ సమీక్ష నిర్వహించారు. విధి విదానాలను వివరించి, నిర్దేశించిన లక్ష్యాలను గడువులో పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మోహన్, కెన్నడీ, ఏపీఎంలు వెంకటేశ్వర్లు, గౌరిశంకర్, స్త్రీ నిధి ఆర్‌ఎం గంగారాం, రెండు మండలాల సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

చేగుంట, ఫిబ్రవరి 6: చేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ వికాస్ ఆధ్వర్యంలో మంగళవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. రక్తహీనత ఉన్న విద్యార్థులకు ఐరన్ టాబ్లెట్స్ అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశం, సరిత, వైద్య సిబ్బంది సంపతి, రమేష్, మమత, చేగుంట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు నీరజ, ఉపాధ్యాయురాలు భవాని, సుధాకర్‌రెడ్డి, శారద, చక్రధర్ శర్మ, రాజేశ్వర్, వెంకటేశ్, చల్లా లక్ష్మణ్, శృతి, సత్యనారాయణ పాల్గొన్నారు.

కేజీబీవీలో స్వయంపాలన

హత్నూర, ఫిబ్రవరి 6: హత్నూరలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవం జరుపుకున్నారు. కలెక్టర్‌గా అపర్ణ డీఈవోగా ఇందు, జీసీడీవోగా శిరీష, ఎంఈవోగా భవానీ, ఎస్‌వోగా అశ్విని ఉపాధ్యాయులుగా పలువురు వ్యవహరించారు.

'ప్రజాప్రతినిధులు ప్రజల మన్ననలను పొందాలి'

జహీరాబాద్, ఫిబ్రవరి 6: ప్రజాప్రతినిధులు ప్రజల మన్ననలను పొందాలని ఎంపీపీ ఉపాధ్యక్షుడు రాములు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కాశీంపూర్ గ్రామంలో తాజా మాజీ సర్పంచ్ మమత, వార్డు సభ్యులకు ఎంపీపీ ఉపాధ్యక్షుడు రాములు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాజు, పంచాయతీ కార్యదర్శి బీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి

హవేళీఘణపూర్, ఫిబ్రవరి 6: గుండెపోటుతో ఆటోడ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని గంగాపూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గంగాపూర్‌కు చెందిన కావేరి గురుపాదం(32) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. సోమవారం రాత్రి తీవ్రమైన గుండెపోటు రాగా కుటుంబీకులు హుటాహుటినా మెదక్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టరు తెలిపాడు. మృతునికి భార్య సరిత, కూతురు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

మనోహరాబాద్: మనోహరాబాద్ మండలం జీడిపల్లి గ్రామానికి చెందిన మల్లేష్, కోనాయపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ ధర్మేందర్, కొండాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ వార్డు సభ్యులు రాము, బీఆర్ఎస్ నాయకులు మంగళవారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

రక్తదాన శిబిరం

పుల్‌కల్, ఫిబ్రవరి 6: చౌటకూర్ మండలం తాడ్దానిపల్లి శివారులో సంగారెడ్డి-నాందేడ్, ఆకోలా జాతీయ రహదారి టోల్‌ప్లాజా వద్ద మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు.

'రైతు కుటుంబాన్ని ఆదుకోండి'

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 6: కంది మండలం ఎర్దనూర్ గ్రామ పరిధిలో క్రషర్ యజమానులు చేసిన బ్లాస్టింగ్‌లో గాయపడి చేతిని కోల్పోయిన రైతు రమావత్ భీముడు కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డిలో మంగళవారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. క్రషర్ యజమానులు ఎలాంటి హెచ్చరికలు లేకుండా బ్లాస్టింగ్‌లు చేస్తున్నారని ఆరోపించారు. జీవ క్రషర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల పరిశీలన

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 6: సంగారెడ్డిలోని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ప్రాక్టికల్స్ పరీక్షలను మంగళవారం జిల్లా ఇంటర్మీడియట్ అధికారి(డీఐఈవో) గోవిందరామ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా, నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ సునీత తదితరులు ఉన్నారు.

'ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి'

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 6: వైద్య ఆరోగ్య శాఖలో నేషనల్ హెల్త్ పథకం కింద పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని కోరుతూ మెడికల్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయ ఏవో వాణికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మెడికల్ యూనియన్ కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్‌హెచ్‌ఎం కింద పనిచేస్తున్న స్టాఫ్‌నర్స్, ఏఎన్ఎం, సెకండ్ ఏఎన్ఎంలకు రెండు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలి

రామాయంపేట, ఫిబ్రవరి 6: విద్యార్థులు త్వరలో జరిగే ఫైనల్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు సూచించారు. రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ సబ్జెక్టుపై విద్యార్థులు పట్టు సాధించాలని అన్నారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, అధ్యాపకులు ఉన్నారు.

రోడ్డు నియమాలపై అవగాహన

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 6: వాహనదారులందరూ రోడ్డు నియమాలు పాటించాని అల్లాదుర్గం సీఐ రేణుకరెడ్డి సూచించారు. మంగళవారం పెద్దశంకరంపేటలో రోడ్డు నిబంధనలపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ద్విచక్రవాహనాలు నడిపే వారు హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపే వారు సీటు బెల్టును ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బాల్‌రాజ్, ఎస్‌ఐ సునీత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాత నేరస్థులకు కౌన్సెలింగ్

జహీరాబాద్, ఫిబ్రవరి 6: పాత నేరస్థులు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని జహీరాబాద్ పట్టణ సీఐ రాజబోయిన రవి సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పాత నేరస్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత నేరస్థులు భూ తగాదాల్లో తలదూర్చితే క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. పీడీచట్టం కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. భూ బాధితులు పాత నేరస్థులను సంప్రదించినా కేసులు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో ఎస్‌ఐ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

'పరిశుభ్రత కోసం పాటుపడాలి'

హత్నూర, ఫిబ్రవరి 6: గ్రామాల్లో పరిశుభ్రత కోసం ప్రతీ ఒక్కరూ పాటు పడాలని ఎంపీడీవో శారదాదేవి సూచించారు. నస్తీపూర్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఎంపీడీవో మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్తను తరలించడానికి వచ్చే వాహనంలో వేయాలని సూచించారు. అధికారులతో మమేకమై గ్రామాభివృద్ధికి తోడ్పడాలని గ్రామస్థులను కోరారు. ఇదిలా ఉండగా గ్రామ తాజా మాజీ సర్పంచ్ ఎల్లయ్యను గ్రామ సమైక్య సంఘం మహిళలు, యువకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కిషన్‌రావు, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ సాయిలు పాల్గొన్నారు.

నేటి నుంచి శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

కల్హేర్/కోహీర్, ఫిబ్రవరి 6: ఈ నెల 7 నుంచి 15 వరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కల్హేర్ ఎంపీడీవో శ్రీనివాస్, కోహీర్ ఎంపీడీవో సుజాతనాయక్ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజు గ్రామాల్లో అందరిని భాగస్వాములను చేసి షెడ్యూలు ప్రకారం సూచించిన వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బుధవారం ఇందుకు సంబంధించిన వివరాలను గ్రామసభలు నిర్వహించి ప్రజలకు తెలియజేయాలని ప్రత్యేకాధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

బీఆర్ఎస్‌తోనే తండాల అభివృద్ధి: ఎంపీపీ

శివ్వంపేట, ఫిబ్రవరి 6: బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే గిరిజన తండాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాయని శివ్వంపేట ఎంపీపీ హరికృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తాళ్లపల్లి తండాలో రూ.ఐదు లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన తండాలకు అప్పటి సీఎం కేసీఆర్ హయాంలోని ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భారతి, ఎంపీటీసీ గోవింద్‌నాయక్, నాయకులు శేఖర్‌గౌడ్, సంజీవ్‌చారి ఈశ్వర్, అంజనేయులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి చెత్త గంగోజిపేటలో డంపింగ్

● కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు

పుల్‌కల్, ఫిబ్రవరి 6: సంగారెడ్డిలోని ప్రభుత్వాస్పత్రి చెత్తను చౌటకూర్ మండలం గంగోజిపేట గ్రామ శివారులోని డంప్ చేయడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతికి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆస్పత్రిలో రోగులకు వినియోగించిన సిరంజీలు, సూదులు, గ్లూకోజ్ బాటిల్స్‌ను, ఇతర చెత్తను లారీల్లో తెచ్చి డంప్ చేస్తున్నారని వివరించారు. గ్రామానికి చెందిన దళితులకు ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ భూముల్లో చెత్తను పారబోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై విచారణ జరిపి సంబంధిత సిబ్బంది, అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

మహిళా అభ్యున్నతికి తోడ్పాటును అందించాలి

● డీఎస్పీ రమేశ్‌కుమార్



మాట్లాడుతున్న డీఎస్పీ రమేశ్‌కుమార్

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 6: మహిళల అభ్యున్నతికి ప్రతీ ఒక్కరూ తోడ్పాటును అందించాలని డీఎస్పీ రమేశ్‌కుమార్ కోరారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం బేటీ బచావ్-బేటీ పడావ్ కార్యక్రమంలో భాగంగా భరోసా, షీటీంల సహకారంతో పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవిస్తూ, వారి అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగలక్ష్మీ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ పల్లవి, తారా ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, భరోసా కో ఆర్డినేటర్ దేవలక్ష్మి పాల్గొన్నారు.

దీక్షతో చదివితే మెరుగైన ఫలితాలు

● ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, ఫిబ్రవరి 6: దీక్షతో చదివేతేనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 7వేల మంది పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎలాంటి ఒత్తిడికి గురి చేయకూడదని సూచించారు. జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ ద్వారా విద్యార్థులను మానసికంగా పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు వ్యక్తిత్వ వికాస నిపుణులు వీరేందర్, పూర్ణకృష్ణ, ఎంఈవో రాథోడ్ ఆధ్వర్యంలో ప్రేరణ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుప్రజవెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ సుష్మ, నాయకులు వెంకట్‌రెడ్డి, దశరథరెడ్డి, పట్నంరాజు తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష సామగ్రిని అందజేస్తున్న ఎమ్మెల్యే

గ్రామ పంచాయతీ సిబ్బందిని ప్రభుత్వం ఆదుకోవాలి

● సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ డిమాండ్

చిన్నశంకరంపేట/చేగుంట, ఫిబ్రవరి 6: గ్రామ పంచాయతీ సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం పంచాయతీ సిబ్బంది సమస్యలను తీర్చాలని డిమాండ్ చేస్తూ చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీశైలానికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో వెట్టిచాకిరి చేస్తున్న పారిశుధ్య కార్మికుల పరిస్థితులు అయోమయంగా ఉన్నాయన్నారు. పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేసి మల్టీపర్పస్ విధానాన్ని ఎత్తి వేయాలని కోరారు. ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది సిద్ధిరాములు, బాబు, మల్లేశం, దుర్గయ్య, యాదయ్య, ఎల్లయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే చేగుంటలో నిర్వహించిన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనాలు ఇవ్వాలని కోరారు. 16న జరిగే దేశవ్యాప్త సమ్మెకు కార్మికులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు యాదమ్మ, పద్మ, లావణ్య, నవనీత పాల్గొన్నారు.



చేగుంటలో సమ్మె కరపత్రాలు విడుదల చేసిన మధ్యాహ్న భోజన కార్మికులు

సమ్మె నోటీసు అందజేత

నారాయణఖేడ్: సీఐటీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు అతిమేల మాణిక్ ఆధ్వర్యంలో మంగళవారం ఖేడ్‌లోని పలు శాఖల ప్రభుత్వ అధికారులకు ఈ నెల 16న నిర్వహించనున్న సమ్మెకు సంబంధించిన నోటీసులను అందజేశారు.

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చేయవద్దు

● మున్సిపల్ చైర్మన్ అశోక్



అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న చైర్మన్

నర్సాపూర్, ఫిబ్రవరి 6: విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు సేవ చేయాలని నర్సాపూర్ మున్సిపల్ మున్సిపల్ సిబ్బంది, కార్మికులకు చైర్మన్ అశోక్‌గౌడ్ సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకట్ గోపాల్‌తో కలిసి మంగళవారం అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు చేయాలంటే పన్నులు సకాలంలో వసూలు చేయాలని, ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. సిబ్బంది, కార్మికులు ఎప్పటికప్పుడు వార్డులు, కాలనీల్లో వీధిదీపాల నిర్వహణ, పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. 2024-25బడ్జెట్‌లో చేపట్టాల్సిన పనులకు కేటాయించే నిధుల విషయంలో జాగ్రతగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో మేనేజర్ మధుసూదన్, ఏఈ స్వామిదాస్ పాల్గొన్నారు.

కార్యదర్శి లేక.. ప్రత్యేకాధికారి రాక

నారాయణఖేడ్, ఫిబ్రవరి 6: నిజాంపేట గ్రామానికి పంచాయతీ కార్యదర్శి లేక, ప్రత్యేకాధికారి రాక గ్రామస్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. నిజాంపేట కార్యదర్శిగా కొనసాగుతున్న రాములు గత నెల 20న సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో నియమించిన జనార్ధన్‌రెడ్డి విధుల్లో చేరలేదు. దీనికి సర్పంచుల పదవీకాలం పూర్తి కావడంతో నిజాంపేట తహసీల్దార్‌ను ప్రత్యేకాధికారిగా నియమించారు. అయినప్పటికీ ఆయన తహసీల్దార్ కార్యాలయంలోనే పనుల ఒత్తిడి కారణంగా గ్రామ పంచాయతీపై దృష్టి సారించడం లేదు. దీంతో పనులు కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

'సేవాలాల్ జయంతిన సెలవు ఇవ్వాలి'

పుల్‌కల్, ఫిబ్రవరి 6: సేవాలాల్ మహరాజ్ జయంతి రోజున సెలవు దినంగా ప్రకటించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం శివంపేటలో ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ జయంతి ఫిబ్రవరి 15న దేశ వ్యాప్తంగా సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. ప్రత్యేక వేష, భాష, సంస్కృతి, సంప్రాదాయాన్ని గిరిజనులు ^లిగి ఉన్నారని తెలిపారు. బంజారాలను భక్తి మార్గంలో నడిపించిన సేవాలాల్ జయంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెలవుదినంగా ప్రకటించాలని కోరారు.